## గెస్ట్ లెక్చరర్లకు గుడ్ న్యూస్ చెప్పిన ప్రభుత్వం

అమరావతి: అమృత్ తెలంగాణ: ఏపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. వారి పారితోషికాలను గణనీయంగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు (జీఓ) జారీ చేసింది. పెంచిన వేతనాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. తాజాగా విడుదల చేసిన జీఓ ప్రకారం, గెస్ట్ లెక్చరర్లకు ప్రస్తుతం గంటకు చెల్లిస్తున్న రూ.150 పారితోషికాన్ని రూ.375 కు పెంచారు. దీంతో పాటు, నెలకు గరిష్టంగా పొందగల వేతనాన్ని రూ.27,000గా ప్రభుత్వం నిర్ధారించింది. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 1,177 మంది గెస్ట్ లెక్చరర్ల కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనివ్వనుంది.


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 214. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ మంగళవారం.13.05.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## మీసేవా ఉద్యోగుల వేతనాలు పెంచాలి

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:రాష్ట్ర ప్రభుత్వం మీసేవా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి కనీస వేతనాలను పెంచాలని తెలంగాణ మీసేవా ఎంపాయ్లిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్, అధ్యక్షులు ఆర్.సురేశ్, ప్రధాన కార్యదర్శి జెనీమా డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మీసేవా ఈఎస్‌డీ కమిషనర్ రవికిరణ్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెడుతున్న అనేక సేవల వల్ల మీసేవా ఉద్యోగులపై భారం పెరుగుతున్నదని వాపోయారు. రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు, మున్సిపల్ సేవలకు సంబంధించిన బర్త్ సర్టిఫికెట్లలో సవరణలు, తదితర సేవలు ఇటీవలి కాలంలో పెరిగిన విషయాన్ని గుర్తుచేశారు. అంత కష్టపడుతున్నా వారికి కనీస వేతనం దక్కట్లేదని వాపోయారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచాలని విన్నవించారు. వార్షిక బోనస్, ఇన్సెంటీవ్‌లో ఏదో ఒకదానిని ప్రతి ఏటా చెల్లించాలని కోరారు.

# జీసీసీకి హబ్‌గా హైదరాబాద్

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: హైదరాబాద్ మహానగరం సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్‌తోపాటు ఇంకా అనేక రంగాల్లో జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)కి హబ్‌గా మారిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. అలాగే ఏఐ–రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు ఇది కేంద్రంగా మారిందని ఆయన చెప్పారు. అందువల్ల హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి, ఘన విజయాలను సొంతం చేసుకోండంటూ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థ కొత్త ఫెసిలిటీ సెంటర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొనాటా సాఫ్ట్‌వేర్ అత్యాధునిక ఏఐని ఉపయోగించి పర్యావరణ వ్యవస్థలను రూపొందించడం గర్వకారణమని ప్రశంసించారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ దిగ్గజాలు తమ క్యాంపస్‌లను విస్తరిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో తమ ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం పనిచేస్తూనే పరిశ్రమలకు మద్దతునిస్తూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతోందని వివరించారు. డిసెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి కొత్తగా రూ.3లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం లక్షకుపైగా ఉద్యోగాలను సృష్టించిందని చెప్పారు. ఈ యేడాది దావోస్‌లో జరిగిన ఒప్పందాల ప్రకారం మన రాష్ట్రం రూ. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులను రాబట్టి నంబర్‌వన్‌గా నిలిచిందని వివరించారు. ఈ రకంగా దేశీయంగా, అంతర్జాతీయంగా పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానంలో ఉన్నామని తెలిపారు. దీంతోపాటు పోలీసింగ్, శాంతిభద్రతలు, ద్రవ్యోల్బణ నిర్వహణ, ఉద్యోగాల సృష్టి, పన్ను వసూళ్లలో కూడా తెలంగాణ మొదటి స్థానంలో కొనసాగుతోందని విశ్లేషించారు. రాష్ట్రంలోని 66 లక్షల మంది మహిళలకు స్వయం సహాయక బృందాల ద్వారా సాధికారత లభించిందని అన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా ప్రభుత్వం యువతకు వ్యాపార అవకాశాలను కల్పిస్తోందని చెప్పారు. స్వయం ఉపాధికి అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ ఫోర్స్‌లో ట్రాన్స్‌జెండర్




స్వచ్ఛంద సేవకులను నియమించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని గుర్తుచేశారు. డ్రై పోర్టు నిర్మాణం, ఆంధ్రప్రదేశ్ సముద్ర ఓడరేవుతో అనుసంధానం, ఫ్యూచర్ సిటీలో ఏఐ నగరం, యంగ్ ఇండియా స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం కొనసాగుతున్నాయని వివరించారు. ప్రపంచంలోనే గొప్ప ఈవెంట్లలో ఒకటిగా పేరొందిన మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్నాయని గుర్తు చేశారు. భవిష్యత్తులో మరిన్ని ప్రపంచ ఈవెంట్ల నిర్వహణకు తమ ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ కార్యాచరణ ద్వారా ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని సీఎం వ్యాఖ్యానించారు. ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో, హైదరాబాద్‌ను అత్యద్భుత నగరంగా తీర్చిదిద్దటంలో ప్రభుత్వానికి సహకారం అందించాలంటూ ఆయన ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలను కోరారు. కార్యక్రమంలో శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# భారత సైన్యానికి, శాస్త్రవేత్తలకు నా సెల్యూట్ : ప్రధాని మోడీ

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి జాతినుద్దేశంచి ప్రధాని మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి, శాస్త్రవేత్తలకు మోడీ సెల్యూట్ చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో మన బలగాలు ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించాయని కొనియాడారు. దేశ ప్రజలందరి తరపున సైన్యానికి అభినందనలు చెబుతున్నానన్నారు. ఉగ్రవాదులను మట్టిలో కలిపేందుకు సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చినట్లు చెప్పారు. పహల్గామ్‌లో అత్యంత దారుణంగా కుటుంబ సభ్యుల ముందు భాగస్వాములను ఉగ్రవాదులు చంపేశారని.. ఇది వ్యక్తిగతంగా తనను ఎంతగానో బాధించిందని మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. పాక్ తదుపరి చర్యలపై కన్నేసి ఉంచామన్నారు. పాక్ తొక జాడిస్తే పరిణమాలు మరింత తీవ్రంగా ఉంటాయి. పాక్ న్యూక్లియర్ బ్లాక్ మెయిల్ చేస్తే సహించేది లేదన్నారు ఆ పరిస్తితే



వస్తే భారత్ కి ఏం చేయాలో భారత్ కు బాగా తెలుసన్నారు.

# గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ భేటీలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా పాల్గొన్నారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో సీఎం గవర్నర్‌తో సమావేశమైనట్టు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి గురించి ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గవర్నర్‌కు వివరించారు. సమాచార కమిషన్ చైర్మెన్‌గా చంద్రశేఖరరెడ్డిని నియమించిన దరిమిలా మిగతా సభ్యుల



నియామకాలకు కూడా ఆమోదముద్ర వేయాలంటూ సీఎం, గవర్నర్‌ను కోరినట్టు తెలిసింది. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలోనే సోమవారం సాయంత్రం సంబంధిత జీవో విడుదల కావటం గమనార్హం.

# ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్యం

వికారాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్యం అందిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించే విధంగా వైద్య సేవలు ఉండాలని అధికారులకు మంత్రి సూచించారు. సోమవారం వికారాబాద్ జిల్లాలో మంత్రి పర్యటించారు. పరిగి పట్టణ కేంద్రంలో రూ.27 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల ప్రాంతీయ ఆస్పత్రి పనులకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి. రామ్మోహన్‌రెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, ఆర్యవైశ్య ఫెడరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాతతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే, వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో రూ.30 కోట్లతో నిర్మించిన 300 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని మంత్రి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రుల, వైద్య కళాశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, బ్లడ్ బ్యాంక్, వైద్యుల విధుల నిర్వహణ తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని రకాల స్పెషాలిటీ వైద్య సేవలు ఇక్కడ అందుబాటులోకి తెస్తామన్నారు. డయాలసిస్ సెంటర్‌లో బెడ్లు, మిషన్ల సంఖ్యను పెంచి కిడ్నీ పేషెంట్లను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలు కాపాడేలా అత్యాధునిక వసతులతో ట్రామా కేర్ సెంటర్లు అభివృద్ధి చేస్తామన్నారు. అంబులెన్స్‌ల సంఖ్యను పెంచి, అత్యవసర సేవలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇటీవలే 213 కొత్త అంబులెన్స్‌లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో గతేడాది 16 కొత్త నర్సింగ్ కాలేజీలను ప్రారంభించుకున్నామన్నారు. గతేడాది 6,956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేశామని, మరో 2,300 పైచిలుకు పోస్టుల భర్తీ ప్రక్రియ నెల రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల రూపు రేఖలను మార్చడానికి బ్రాండింగ్ కార్యక్రమాన్ని



చేపట్టామని, ఈ కార్యక్రమం ద్వారా మరింత ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా ఆస్పత్రులను అభివృద్ధి చేసి, పేషెంట్లకు మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తామని అన్నారు. ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ, సూపరిం టెండెంట్‌లు జవాబుదారీతనంతో ఉండాలన్నారు.

జిల్లాలోని ప్రభుత్వేతర ఆస్పత్రులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కుల గణన సర్వే నిర్వహించి 75 అంశాలతో కూడిన సమాచారాన్ని సేకరించినట్టు తెలిపారు. కులాలకతీతంగా సామాజిక న్యాయం జరగాలనే నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలిపినట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ అజరు కుమార్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, డీసీహెచ్‌ఓ ఆనంద్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రాజేశ్వర్‌రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణపై త్వరలో నిర్ణయం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: విద్యావ్యవస్థలో సమూల మార్పు రావాల్సిన అవసరముందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గత పదేండ్లలో రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన విద్యా వ్యవస్థ ముఖ చిత్రాన్ని మార్చాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమని చెప్పారు. ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై తల్లిదండ్రులు, సంబంధింత యాజమాన్యాల అభిప్రాయాలను సేకరించామనీ, త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని వివరించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో 'విద్యా రంగంలో సంస్కరణలు' అనే అంశంపై నియమించిన మంత్రివర్గ ఉప సంఘం సమావేశాన్ని మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. తల్లిదండ్రులు, ప్రయివేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు, విద్యా శాఖాధికారులతో సుమారు అయిదు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై ప్రధానంగా చర్చించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ విద్యా వ్యవస్థ దేశంలోనే ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా ఉండేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చకు వచ్చింది. ఇతర రాష్ట్రాల అధికారులు తెలంగాణకొచ్చి అధ్యయనం చేసేలా మార్పు తీసుకురావాలని సంబంధిత మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. ప్రయివేట్, ఇంటర్నేషనల్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి సంకల్పమని వివరించారు. సర్కార్ బడులపై తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంపొందించి, వాటికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఇక్కడి విద్యార్థులను చిన్నతనం నుంచే ఏఐ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో నిపుణులు తీర్చిదిద్దేలా సిలబస్‌లో మార్పులు చేస్తున్నామని అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సర్కార్ బడుల్లో పనిచేసే ఉపాధ్యాయులను అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చి దిద్దేందుకు కావాల్సిన శిక్షణపై సమావేశంలో చర్చించామని వివరించారు. ఇప్పటికే డీఈవోలకు మూడురోజులపాటు ప్రత్యేక క్యాంప్ నిర్వహించామనీ, సత్ఫలితాలొచ్చాయని ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు వివరించారు. డీఈవో, ఎంఈవోలు క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు నిర్వహించి లోపాలను సరి చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రయివేట్ విద్యాసంస్థలపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థుల భద్రత ముఖ్యమనీ, ఈ అంశంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలో గ్రేడింగ్ కొనసాగిస్తారా మార్కులు ఇస్తారా.. లేదా ఈ ఏడాది మాదిరిగానే రెండింటిని కొనసాగిస్తారా అనే అంశంపై తల్లిదండ్రులు, విద్యార్థులకు ముందు నుంచే అవగాహన కల్పించాలని



విద్యా శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలిచ్చే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ)ని తప్పనిసరిగా అమలు చేస్తామనీ, ఇందుకోసం ఎంత బడ్జెట్ అయినా కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. విద్యార్థులకు మరింత పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో కామన్ డిటెన్షన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు ప్రారంభించామని చెప్పారు. ఒకే రకమైన పరీక్షా ఫీజును కూడా రూపొందిస్తామన్నారు. 2025–26 నుంచి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా వేయి ప్లే స్కూల్స్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రారంభించబోతున్నట్టుగా వివరించారు. ప్రయివేట్ సంస్థలను భాగస్వామ్యం చేసి సీఎస్ఆర్ నిధులతో వాటిని దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చి దిద్దుతామన్నారు. ఇక్కడి కరిక్యులమ్, ట్రైనింగ్ మెటీరియల్‌ను ఎస్‌సీఈఆర్‌టీ నిపుణుల భాగస్వామ్యంతో రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా, ప్రత్యేక కార్యదర్శి హరిత, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ట్రస్మా ప్రతినిధులు ఎస్ఎన్ రెడ్డి, మధుసూదన్, హెచ్‌ఎస్పీఏ నుంచి వెంకట సాయినాథ్, ఇస్మా ప్రతినిధులు సునీల్ కుమార్, వైసీ చౌదరి, ముస్లిం మైనార్టీ అసోసియేషన్ నుంచి అన్వర్ అహ్మద్, క్రిస్టియన్ అసోసియేషన్ తరపున బాలశౌరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్టాక్ ఎక్స్ఛేంజీలో తెలంగాణ భూములుకుదవపెడుతున్న సీఎం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ భూములను సీఎం రేవంత్‌రెడ్డి స్టాక్ ఎక్స్ఛేంజీలో కుదవ బెట్టి, రాష్ట్రాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని లక్షా 75 వేల ఎకరాల టీజీఐఐసీ భూములను స్టాక్ ఎక్స్ఛేంజీలో తాకట్టు పెట్టడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ అయిన టీజీఐఐసీని ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రహస్య జీవో విడుదల చేసిందని ఆరోపించారు. టీజీఐఐసీ హౌదాను మార్చడం ద్వారా రూ.వేల కోట్ల అదనపు రుణాలు సేకరించాలన్నదే రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఎజెండాగా ఉందన్నారు. రహస్యంగా జీవో జారీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజల సంపదను స్టాక్ ఎక్స్ఛేంజీలో తాకట్టు పెట్టాల్సిన అవసనరం ఏమొచ్చిందని నిలదీశారు. అక్కడ నష్టం జరిగితే తెలంగాణ భూముల భవితవ్యం ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. ఏకపక్షంగా తీసుకున్న టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్చే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.



### రేవంత్‌కు రూ.20 వేల కోట్ల కమీషన్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 16 నెలల పాలనలో రేవంత్ రెడ్డి సర్కారు రూ.1.80 లక్షల కోట్లకు పైగా అప్పులు తెచ్చిందని కవిత గుర్తుచేశారు. ఈ అప్పులతో ఏ ఒక్క పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయలేదనీ, హామీ ఇచ్చిన కొత్త పథకాలను ప్రారంభించలేదనీ, అభివృద్ధి పనులకూ వెచ్చించలేదని ఆమె విమర్శించారు. అయితే తెచ్చిన అప్పులో గతంలో చేసిన అప్పులకు చెల్లించింది రూ.80 వేల కోట్లు కాగా మిగతా రూ.లక్ష కోట్లను బడా కాంట్రాక్టర్లకు ఇచ్చిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో నుంచి 20 శాతం కమీషన్ రూపంలో రూ.20 వేల కోట్లను రేవంత్ రెడ్డి తన సొంత ఖజానాకు చేర్చుకున్నారని ఆమె ఆరోపించారు. దీనికి సంబంధించి తన వద్ద పూర్తి ఆధారాలున్నాయని ఆమె స్పష్టం చేశారు. తాను చెప్పేది అబద్ధమైతే, అప్పులు, రుణాల తిరిగి చెల్లింపులు, ప్రభుత్వ వ్యయాలపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆమె సవాల్ విసిరారు. రాష్ట్ర క్యాబినెట్ మంత్రికి చెందిన సొంత కాంట్రాక్టు సంస్థకు, మేఘా ఇంజనీరింగ్ కంపెనీకి బిల్లులు చెల్లించడం మినహా రేవంత్ రెడ్డి చేసిన అభివృద్ధి అంటూ ఏమీ లేదని ఆమె కొట్టిపారేశారు. దాదాపు రూ.2 లక్షల కోట్ల అప్పులు తెచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక్క మంచి పని కూడా చేయలేదని విమర్శించారు. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల అప్పు తెచ్చారనీ, పెద్ద ఎత్తున చెట్లను నరికేసి ప్రకృతిని నాశనం చేయడానికి ప్రయత్నిస్తే ప్రపంచవ్యాప్తంగా పర్యావరణవేత్తలు ఆందోళన చేశారని గుర్తు చేశారు. తద్వారా ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ ప్రతిష్టను రేవంత్ రెడ్డి దెబ్బతీశారని ఆమె మండిపడ్డారు.

## విద్యార్థినిపై సామూహిక లైంగికదాడి

నిజాంపేట్ :అమృత్ తెలంగాణ: ఉన్నత విద్యకు అడ్మిషన్ కోసమంటూ స్నేహితున్ని నమ్మి వెంట వచ్చిన విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడి చేశారు. మద్యం మత్తులో స్నేహితునితోపాటు అతని మిత్రుడు కలిసి ఆమెపై దారుణానికి ఒడిగట్టారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార?ండ్ రాష్ట్రానికి చెందిన యువతి తమిళనాడు చెన్నైలోని లిగం కళాశాలలో బయో మెడికల్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. అదే కళాశాలలో అజరు బీటెక్ చదువుతున్నాడు. ఇరువురికి మంచి స్నేహం ఏర్పడటంతో ఉన్నత విద్య అడ్మిషన్ల కోసం హైదరాబాద్‌కు వెళ్దొద్దామంటూ అజరు ఆమెకు సూచించాడు.

# ప్రజలందరూ గౌతమ బుద్ధుని శాంతి మార్గంలో నడవాలి.

## నిర్మల్ బుద్ధ విహార్ కమిటీ.





బుద్ధ పౌర్ణమి కార్యక్రమం

నిర్మల్ మే 12 ( అమృత్ తెలంగాణ ) సోమవారం ఉదయం 11 గంటలకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్లో గల నిర్మల్ బుద్ధ విహార్ లో బుద్ధ విహార్ కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి మూర్తి మానవతవాది ప్రజలందరి ఆదర్శవంతుడు గౌతమ బుద్ధుని 2569 వ బుద్ధ పూర్ణిమ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ముందుగా గౌతమ బుద్ధుని విగ్రహానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలు సమర్పించి ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పంచశీల జెండా నీలి జెండాలను ఎగురవేశారు పంచశీల ప్రార్థన చేశారు పలువురు బుద్ధ విహార్ కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రపంచ శాంతి దూత తథాగత్ గౌతమ బుద్ధుని శాంతి మార్గంలో నడవాలని అన్నారు గౌతమ బుద్ధుని ఆశయాలను సిద్ధాంతాలను ప్రజలందరికీ తెలియపరచాలని కోరారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కోరుకున్నటువంటి బౌద్ధమయ భారతదేశం గా తీర్చిదిద్దాలని అన్నారు ఈ కార్యక్రమంలో బుద్ధ విహార్ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కుంటోల్ల వెంకటస్వామి, మధుకర్ మునేశ్వర్, గౌరవ అధ్యక్షులు ప్రభాకర్ సానే, సలహాదారులు దేవుళ్ళ గంగాధర్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు కొంతం మురలీధర్, బుద్ధ విహార కమిటీ నాయకులు రావుల గంగన్న, ఈరోల పురుషోత్తం, జాడే సంజీవ్, భగత్ నారాయణ, గుండె రావు సాగర్, డాక్టర్ ఉత్తం, అరుణ రాణి మునేశ్వర్, గంగాసాగర్ సానే, మధుకర్ గైక్వాడ్, సంఘర్ష్, కొంతం అడెల్లు, సింగరి జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని పల్లెల్లో రాజకీయాల చిచ్చు..

## తరాలు మారిన తలరాతలు మారడం లేదు...

## పచ్చని పల్లెలను కాపాడుకుందాం..

## సీనియర్ పాత్రికేయులు ఈర్ల గణేష్...

అమృత్ తెలంగాణ నిర్మల్ :పల్లెటూరు అంటేనే జీవితం, ఆనందాయక ప్రకృతి సోయగాలు,అందమైన జీవనం,పరస్పర సహకారం, స్నేహబంధాలకు నిలయం, గడిచిన తరాల పల్లె ప్రజలు, భేదాభిప్రాయాల కంటే బంధాలు,బంధుత్వాలకు ఎక్కువ విలువిచ్చేవారు.కానీ, రాను రాను కొన్ని పల్లెల్లో రాజకీయ పార్టీల జోక్యం ఎక్కువైంది.కొందరు నేతలు తమ స్వార్థం కోసం పల్లె ప్రజలను కులాలుగా, వర్గాలుగా విడగొడుతున్నారు. వారిలో వారికే చిచ్చుపెట్టి పగలు,ప్రతీకారాలతో కొట్టుకుచచ్చేలా చేస్తున్నారు. తద్వారా గ్రామాల్లో అభివృద్ధి కుంటువడేలా చేస్తున్నారు. పల్లె గడ్డపై రాజకీయ చిచ్చు నెమ్మదిగా వ్యాపించి, ఐక్యతను చీల్చే విషంలా మారి కల్మషమెరుగని మనుషుల మధ్య విద్వేషాన్ని పెంచుతున్నది.ప్రతి ఎన్నికతో పాటే పల్లెల్లో విభేదాలు, పగలు, ప్రతీకారాలు పెరుగుతున్నాం.వర్గాలుగా విడిపోయిన ప్రజలు చిన్నచిన్న విషయాలపైనా గొడవ పడుతున్నారు.చివరికి ప్రాణాలు తీయటానికి కూడా వెనకాడని పరిస్థితికి వచ్చారు. ఒకే ఊరిలో రెండు వర్గాలు, రెండు ధ్వజాలు ఒకే ఉత్సవానికి వేర్వేరు వేదికలు ఉండటం...మిత్రులుగా ఉన్నవారు శత్రువులుగా, శత్రువులుగా ఉన్నవారు మిత్రులుగా మారడం చూస్తున్నాం.కొన్నిసార్లు బంధువులను కూడా బద్ధ శత్రువులుగా మారుస్తున్నాయి.పల్లె రాజకీయాలు,చాలా చోట్ల గ్రామ పంచాయతీ సమావేశాలు అభివృద్ధి చర్చల కోసం కాకుండా పరస్పర ఆరోపణలకు అడ్డాగా మారుతున్నాయి.పంచాయతీ కార్యాలయం ఎదుట జరిగే సమావేశాల్లో అభివృద్ధి ప్రణాళికల గురించి కంటే పార్టీల గొడవలు,కార్యకర్తల కొట్లాటలు,ఎవరు ఏ పార్టీకి చెందినవారనే విషయాలే ప్రధానాంశాలు అవుతున్నాయి.పల్లెలో పార్టీకో పెద్ద రాజకీయ నాయకుడు,అతని కింద చిన్న నాయకులు..వారి పంతమే నెగ్గాలనే ఆలోచనలు..వెరసి గ్రామాభివృద్ధి కుంటుపడి రాజకీయ రక్షలు పెరుగుతున్నాయి.ఈ వర్గ విభేదాల కారణంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులు, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ,ముఖ్యంగా అర్హులైన వారికి చేరడం లేదు. నిత్యావసర సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కొందరికే పరిమితమవుతున్నాయి. పథకాలు అర్హులైన, అవసరమైన వారి దరి చేరకుండా ఈ వర్గ రాజకీయాలు అడ్డుకుంటున్నాయి. చాలామంది వృద్ధులు, మహిళలు,పేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఒకప్పుడు గ్రామాభివృద్ధి కోసం కలలు కన్న యువత రాజకీయ అసహనంతో అట్టుడుకుతున్నారు.వారి హృదయాల్లో నూతన ఆశలు మొలకెత్తాల్సిన సమయంలో నిరాశ, నిస్పృహలు అలుముకుంటున్నాయి. ఊరంతా కలిసికట్టుగా ఎదగాలనే కలలు.మా వర్గమే గెలవాలనే కుటిల కాంక్షలో కనుమరుగైపోతున్నాయి. ఒక పార్టీ గెలిచి మరో పార్టీ ఓడినప్పుడు గ్రామం గెలవదు. గ్రామం గెలవడం అంటే ప్రతి ఇంట్లో వెలుగు నిండటం.ప్రతి కుటుంబంలో సంపద పెరగడం..గ్రామంలో పిల్లలకు మెరుగైన విద్య, వైద్య సేవలు అందడం..వృద్ధులకు గౌరవం లభించడం..ప్రభుత్వ పథకాలు బలహీనవర్గాలకు అందడం,ఒక్కమాటలో చెప్పాలంటే గెలుపంటే సామూహిక అభివృద్ధి. రాజకీయాలు వేయడం, పార్టీలకు మద్దతుగా నిలవడం తప్పు కాదు.ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ఎన్నికల ద్వారానే తన భవిష్యత్తును నిర్ణయించే నాయకున్ని ఎన్నుకునే హక్కు ఓటరుకు ఉంది,కానీ,అది గ్రామస్థాయిలో వ్యక్తిగత పగ, ప్రతీకారాలకు సాధనంగా మారడం మాత్రం సరైనది కాదు. అందుకే పల్లె ప్రజలు విచక్షణతో మెలగాలి.పెద్ద పెద్ద నాయకులంతా బాగానే ఉంటారు.కానీ,గ్రామాల్లో సామాన్య కార్యకర్తలు మాత్రం కక్షలతో జీవిస్తుంటారు. ఇలా పగప్రతీకారాలు పెంచుకుంటూపోతే మనుషులు మాత్రమే కాదు, పల్లె కూడా నాశనమవుతుంది. వర్గ, కుల బలహీనతల్ని వదిలి,గ్రామాన్నిబతికించుకోవాలి. అభివృద్ధి పథంలో నడిపించుకోవాలి.వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాక, గ్రామ సమష్టి శ్రేయస్సు కోసం రాజకీయాలు చేయాలి. తాత్కాలికమైన వాటి కోసం బంధాలను,స్నేహాలను దూరం చేసుకోవడం సరికాదు. రాజకీయం ఎప్పుడూ అభివృద్ధి కోసం ఉండాలి. అంతేతప్ప వినాశనానికి కాదు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే ఆస్కారం ఉంది.ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఈ రాజకీయ కక్షలను పక్కనపెట్టి, పల్లెలో సౌభ్రాతృత్వాన్ని, సహకారాన్ని తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.మన పల్లెను మళ్లీ పచ్చగా, సస్యశ్యామలంగా మార్చాలి.. అభివృద్ధి మార్గంలో అందరూ కలిసికట్టుగా సాగడమే ప్రజాస్వామ్యానికి నిజమైన విజయం.



సీనియర్ పాత్రికేయులు ఈర్ల గణేష్...

# బోరిగంలో బుద్ధుడి విగ్ర ప్రతిష్టాపనతో ఉద్రిక్తత..

## ఎస్పీ ఆధ్వర్యంలో ఇరు వర్గాలను చెదరగొట్టిన పోలీసులు...

## బుద్ధుడి విగ్రహాన్ని తాసిల్దార్ కార్యాలయంకి తరలించిన అధికారులు....

## ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు... బుద్ధుడివిగ్రహం ఉన్నచోటే వెంటనే ప్రతిష్టించాలి లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తాం. జిల్లా నాయకులు...



బుద్ధ పౌర్ణిమ సందర్భంగా బుద్ధుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ప్రదేశం ఇదే



ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్న దృశ్యం



సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్పీ జానకి షర్మిల ఇరు వర్గాలతో మాట్లాడుతున్న దృశ్యం

నిర్మల్ జిల్లా ముధోల్ మే 12 అమృత్ తెలంగాణ ముధోల్ మండలంలోని బోరేగాం గ్రామంలో గత కొన్ని రోజుల నుండి బుద్ధ విహార్ స్థల సమస్య తీవ్రతరం బుద్ధ పూర్ణిమ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సోమవారం బుద్ధ విగ్రహ ప్రతిష్టాపన చేయడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది వివరాల్లోకెళ్తే బోరేగం గ్రామంలో గత కొన్ని నెలల క్రితం ప్రభుత్వ భూమిలో హనుమాన్ విగ్రహాన్ని గ్రామస్తులు ప్రతిష్టించడంతో అంబేద్కర్ యువజన సంఘం వారు తాము కూడా బుద్ధ విహార్ నిర్మాణం కోసం అదే సర్వే నంబర్ అదే ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపడతామని బుద్ధుడి విగ్రహానికి భూమి కేటాయించాలని గత కొన్ని నెలల నుండి అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగిన ఫలితం లేకపోవడంతో సోమవారం బుద్ధ పౌర్ణిమ సందర్భంగా బుద్ధుడు యొక్క విగ్రహాన్ని ప్రతిష్టించడంతో గ్రామంలో ఇతర కులస్తులు ఇక్కడ బుద్ధ విగ్రహ నిర్మాణం చేపట్టవద్దు అంటూ ఉద్రిక్తత చేస్తున్నారు పూర్ణిమ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అక్కడ ఉన్నటువంటి ప్రభుత్వ భూమిలో బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్టించారు అది తెలుసుకున్న గ్రామస్తులు ఇక్కడ బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తగదంటూ అక్కడికి చేరుకొని ముక్కుమూడిగా అంబేద్కర్ సంఘం కార్యకర్తలపై మరియు మహిళలపై ఏకధాటిగా దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ వారికి ఒక న్యాయం మాకు ఒక న్యాయమా వారు ఏ విధంగా అయితే ప్రభుత్వ భూమిలో హనుమాన్ విగ్రహాన్ని నిర్మించడం జరిగిందో బుద్ధ విగ్రహాన్ని మేము నిర్మించుకుంటాం అంటే మాకు ఎందుకు అభ్యంతరం చెప్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు దాడి విషయం తెలుసుకున్న మండల సిఐ మల్లేష్ మరియు ఎస్సై సంజీవ్ సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను శాంతింప చేయడానికి ఎంత ప్రయత్నించినా ఇరువర్గాలవారు వినకపోవడంతో పై అధికారులకు సమాచారం అందించడంతో ఎస్పీ జానకి షర్మిల ఏ ఎస్ పి అవినాష్ కుమార్ అక్కడికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టడంతో ఉద్రిక్తత సద్దుమనగడంతో అక్కడినుండి ఇరు వర్గాలు వెళ్లిపోవడంతో ఆర్డిఓ కోమల్ రెడ్డి, తాసిల్దార్ శ్రీకాంత్, ఘటన స్థలానికి చేరుకొని ప్రభుత్వ భూమిలో నిర్మించినటువంటి బుద్ధ విగ్రహాన్ని తొలగించి తాసిల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లడం జరిగింది ఇది గమనించిన అంబేద్కర్ యువజన సంఘం కార్యకర్తలు మాకు పోలీసుల ప్రొటెక్షన్ తో పంపించేసి అక్కడ ఉన్నటువంటి బుద్ధ విగ్రహాన్ని తొలగించడం చాలా అన్యాయమని అవమానకరమని ఒకరికి ఒక న్యాయం ఇంకొక్కరికి ఒక న్యాయమా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు వెంటనే కలెక్టర్ స్పందించి బుద్ధ విగ్రహానికి స్థలం కేటాయించాలని లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు


# మొబైల్ ఫోన్ పోయిన,చోరికి గురైనా www.ceir.gov.in లో రిజిస్టర్ చేసుకోవాలి.

## జిల్లా పరిధిలో పోగొట్టుకున్న, చోరికి గురైన 52 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత.

## జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్.







అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : సెల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని CEIR ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరి గురైన 52 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. ఎస్పీ గారు మొబైల్ వినియోగదారులను అప్రమత్తంగా ఉండాలన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి CEIR వెబ్సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. CEIR వెబ్సైట్లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్ ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరగిందని అన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1309 ఫోన్ లను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందని అన్నారు. CEIR ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికైనా సెల్ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లో రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సమ్మయ్య,CEIR టీం కానిస్టేబుల్ రాజేశ్వర్, నరేందర్, ప్రత్యూష, సూర్య వంశీ, రాం పవన్ లను జిల్లా ఎస్పీ అభినందించారు

# భారత సైనిక త్రివిధ దళాలకు మద్దతుగా ప్రత్యేక పూజలు




జమ్మికుంట :అమృత్ తెలంగాణ: మనదేశంలోని భారత సైనిక త్రివిధ దళాలకు మద్దతుగా , క్షేమార్థం కోసం భగవద్ అనుగ్రహం కొరకు జమ్మికుంట లోని శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా 108 లీటర్ల ఆవుపాలతో, 108 కొబ్బరికాయలతో ఆలయ అర్చకులు మండలేముల వేణుగోపాల్ శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు అన్నపూర్ణ సేవా సమితి , భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు మాట్లాడారు. ఇది యుద్ధం కాదని, ధర్మం కోసం దేశ గౌరవం కోసం పోరాటమని తెలిపారు. మన ఐక్యత ,మన దేశభక్తి ప్రపంచానికి తెలియజేయాలని అన్నారు. పాకిస్తాన్ కు భారతదేశం ఏంటో స్పష్టంగా చెప్పే సమయం వచ్చిందని, భారత్ ఏకమైతే ఎంత శక్తివంతమైందో చూపే సమయం వచ్చిందన్నారు. మన త్రివిధ దళాల సైనికులకు శ్రీ విశ్వేశ్వర స్వామి వారి పరిపూర్ణమైన అనుగ్రహం కలిగి మరింత శక్తి యుక్తులను వారికి ప్రసాదించి, ఉగ్రమూకులను తుద ముట్టించి భారతదేశం విజయపతానికి దూసుకెళ్లాలని, ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని ఆ విశ్వేశ్వర స్వామిని వేడుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంటకు చెందిన పుర ప్రముఖులు, అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు , భవాని భజన మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బాధ పడుకుర్రి.. బాధ్యత నేను తీసుకుంటా: కేటీఆర్

తంగళ్ళపల్లి :అమృత్ తెలంగాణ: అధైర్య పడొద్దు.. అండగా నేనుంటా అంటూ మహేష్ కు ధైర్యం చెప్పి, మనోళ్ళను పంపించి నీకు అండగా ఉండే విదంగా అన్ని రకాలుగా చూస్తానని మాజీ మంత్రి కేటీఆర్ భరోసానిచ్చారు. జీవనోపాధి కోసం గల్ఫ్ దేశం పోయి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మండేపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త మంద మహేష్ కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆదివారం పరామర్శించారు.సౌదీ అరేబియా దేశంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూన్న మహేశ్ తో విడియో కాల్ లో కేటీఆర్ మాట్లాడుతూ మహేష్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్వంత ఖర్చులతో ఇండియాకు రప్పిస్తాననీ మహేశ్ కు భరోసానిచ్చారు.

# పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ పరీక్ష - 2025 సందర్బంగా అండర్ సెక్షన్ 163 BNSS అమలు: జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ పరీక్ష – 2025 ప్రవేశం కోసం జిల్లా లోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద తేది: 13-05-2025 నాడు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు (08) పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవంచానియా సంఘటనలు జరగకుండా ముందస్తుగా బందోబస్త్ ఏర్పాటు చేసి నిషేధిత ఆదేశాలు జారీ చే జిల్లా ఎస్పీ. కావున జిల్లాలో 8 పరీక్షా కేంద్రాల వద్ద అండర్ సెక్షన్ 163 BNSS (పాత చట్టం 144 సెక్షన్) అమలులో ఉంటుంది అని తెలియచేసారు. అండర్ సెక్షన్ 163 BNSS ప్రకారం

1) ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్ష కేంద్రాల వద్ద గుమి కూడరాదు.

2) నిషేదిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరుగవద్దు.

3) అన్ని పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలోని అన్ని జిరాక్స్ సెంటర్లను 13-05-2025 (ఉదయం 07.00 నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు) మూసివేయాలి. పై నిషేధిత ఉత్తర్వులు 13-05-2025 (ఉదయం 07:00 నుండి మధ్యాహ్నం 3:00 వరకు) అమలులో ఉంటాయి

# ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలి – జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

ప్రజల రక్షణ, భద్రతకై 24 గంటలు బాధ్యతాయుతంగా పని చేసే వ్యవస్థ పోలీస్ వ్యవస్థ.
సరైన సమయంలో న్యాయం జరిగినప్పుడు బాధితులకు లబ్ధి చేకూరుతుంది.
సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయం నందు గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ.
దాదాపు 30 సమస్యలను జిల్లా ఎస్పీకి తెలియజేసిన ఫిర్యాదుదారులు.
సమస్యలను విన్న వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సూచనలు




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : సోమవారం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు ముఖ్య అధికారిని జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదుదారులు కలిసి సమస్యలను తెలియజేశారు. దాదాపు 30 మంది ఫిర్యాదుదారులు ఫిర్యాదులను సమర్పించగా అందులో కుటుంబ కలహాలు, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, పలు కేసుల సమస్యలను విన్న జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలను ఇచ్చి ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమాజంలో 24 గంటలు ప్రజల రక్షణ భద్రతకై పనిచేసే ఏకైక వ్యవస్థ జిల్లా పోలీసు వ్యవస్థ అని తెలియజేస్తూ ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 ను సంప్రదించాలని సూచించారు. జిల్లా ప్రజలు అసాంఘిక కార్యకలాపాలను జరుగుతున్న సమాచారం ఏదైనా మెసేజ్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో భాగంగా 8712659973 అనే నెంబర్ కి సమాచారాన్ని అందించవచ్చని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. వచ్చిన ఫిర్యాదుదారులలో పోలీసు వ్యవస్థ పరిధి దాటి ఉన్న ఆస్తి తగాదాలు, భూమి

తగాదాలు పంచాయితీలు ఉన్నవాటికి చట్ట ప్రకారం ఉన్న నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ స్థాయిలో పరిష్కరించబడే ఏ ఫిర్యాదు నైనా వెంటనే స్వీకరించి పరిష్కరించి ప్రజలకు సరైన సమయంలో న్యాయాన్ని అందించి లబ్ధి చేకూర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసి కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నర్సే స్ డే కార్యక్రమం లో పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలన అధికారి పక్కన రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్



హాజరైన నర్సులు



జ్యోతి ప్రజ్వల చేస్తున్న జిల్లా పాలన అధికారి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : బెస్ట్ ఫ్రెండ్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రిమ్స్ ఆడిటోరియం లో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ నర్సెస్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా పాలనాధికారి రాజర్షి షా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించారు అంతకుముందు చిన్నారులు స్వాగతం నృత్యం తో జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్,, Superendent అశోక్,, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నర్సుల దినోత్సవం జాతీయ నర్సుల వారం మే 6న ప్రారంభమై మే 12 న ముగుస్తుందని,, ఇది ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు (మే 12, 1820 – ఆగస్టు 13, 1910). ఫ్లోరెన్స్ నైటింగేల్ ఒక ప్రసిద్ధ ఆంగ్లేయురాలు, సామాజిక సంస్కర్త, గణాంకవేత్త ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు. క్రిమియన్ యుద్ధంలో గాయపడిన సైనికులను జాగ్రత్తగా చూసుకుంటూ ఆమె ప్రసిద్ధి చెందిందన్నారు. రాత్రిపూట తిరిగే అలవాటు కారణంగా నైటింగేల్‌ను " ది లేడీ విత్ ది లాంప్ " అని పిలిచేవారని ఆన్నారు నర్సుల సేవలు మరువలేనివని రోగులు వారి వృత్తి పట్ల వారి అంకితభావం , నిబద్ధతతో అందించే సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం 2025 థీమ్ ప్రతి సంవత్సరం, అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఒక నిర్దిష్ట ఇతివృత్తాన్ని హైలైట్ చేస్తుంది. 2025 అంతర్జాతీయ నర్సుల దినోత్సవం యొక్క థీమ్ 'మన నర్సులు. మన భవిష్యత్తు. నర్సుల పట్ల శ్రద్ధ వహించడం ఆర్థిక వ్యవస్థలను బలపరుస్తుంది.' ఈ థీమ్ నర్సుల ఆరోగ్యం ,శ్రేయస్సుపై దృష్టి పెడుతుంది .మొత్తం ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు మద్దతు ఇవ్వడంలో ఆరోగ్యకరమైన నర్సింగ్ వర్క్‌ఫోర్స్ యొక్క కీలక పాత్రను పోషిస్తుందని తెలిపారు.

# ప్రజల సమస్యలు త్వరితంగా పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

## టెలిఫోన్, వాట్సాప్ ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ



ప్రజల నుండి ఆర్జీలు తీసుకుంటున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్



హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు తదితర అంశాలపై ప్రజలు తమ వినతులను కలెక్టర్‌కు అందించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించాలంటూ శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను శాఖల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పరిష్కార వివరాలను రిమార్కుల విభాగంలో నమోదు చేయాలని సూచించారు. సమస్య పరిష్కారానికి సంబంధించిన సమాచారం దరఖాస్తుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన టెలిఫోన్ ప్రజావాణిలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫోన్లను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. దూర ప్రాంతాల ప్రజలు 91005 77132 నంబరును సంప్రదించి వాట్సాప్ ద్వారా సమస్యలు పంపవచ్చునని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని, అభ్యంతరాలను స్వీకరించాలని తెలిపారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను మండల స్థాయిలో త్వరితంగా పరిశీలించి బ్యాంకులకు పంపించాలని సూచించారు. జిల్లాలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఉపాధి హామీ పనుల్లో త్రాగునీరు, టెంట్, ఓఆర్ఎస్ పొట్లాల అందుబాటును ఉంచాలన్నారు. ఇటీవల రుణాల మంజూరులో రాష్ట్రస్థాయిలో ఉత్తమ స్థానంలో నిలిచిన గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు, సిబ్బందికి కలెక్టర్, అదనపు కలెక్టర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి లో 107 దరఖాస్తులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో 107 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందనీ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, rdo వినోద్ కుమార్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, భు సమస్యలు, పెన్షన్, ఇందిరమ్మ ఇళ్లు, విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్, dwo, తదితర శాఖలకు సంబంధించి అర్జీలను స్వీకరించి ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్క0రించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



ప్రజావాణి లో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు పరిష్కారం.జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కుంటాల మండలంలోని అంబుగాం గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి భూసమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి చట్టం ద్వారా భూ రికార్డుల్లో తప్పులన్నీ సరిచేసి, భూమిపై యజమానులకు పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కుంటాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పేరు, విస్తీర్ణం లోపాలు, వారసత్వ హక్కులు, సర్వే నంబర్ల లోపాలు, హద్దుల వివాదాలు, భూసేకరణ సమస్యలపై ప్రజల దరఖాస్తులు స్వీకరించామని అన్నారు. దరఖాస్తులకు రశీదులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. హెల్ప్ డెస్క్, త్రాగునీరు వంటి సదుపాయాలను స్వయంగా పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు గ్రామస్తులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి లేనందున ఇబ్బందులు ఎదురవుతోందని గ్రామస్తులు చెప్పగా, రేపటిలోగా కార్యదర్శిని నియమిస్తామని తెలిపారు. రెవెన్యూ సదస్సుకు ఎక్కువ మంది ప్రజలు హాజర కావడం పట్ల కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్తులను అభినందించారు. ఈ సదస్సులో భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ కమల్ సింగ్, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ రాయితీ గడువును ప్రభుత్వం మరోసారి పెంచినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు.

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణలో 25 శాతం రాయితీ వెసులుబాటు గడువును ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు పెంచినట్లు తెలిపారు. ఆమోదం పొందిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ దరఖాస్తులను క్రమబద్ధీకరించుకోవాలని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# బోరిగాం ఘటనపై కేసు..పలువురు అరెస్టు

ముధోల్ :అమృత్ తెలంగాణ: ముధోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో సోమవారం జరిగిన ఘటనలో ఇరు వర్గాలకు చెందిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ముధోల్ సిఐ మల్లేష్ సోమవారం రాత్రి విలేకరులకు తెలిపారు. ఇరు వర్గాలకు చెందిన ఐదుగురిని ప్రస్తుతం అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ ఘటనలో పాల్గొన్న మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పూర్తి విచారణ ఆనంతరం ఈ కేసులో ప్రమేయం ఉన్న మరికొందరిని త్వరలో అరెస్టు చేస్తామని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం




ముధోల్: అమృత్ తెలంగాణ: మండల కేంద్రమైనా ముధోల్ కు చెందిన యండిఅజార్ అనే వ్యక్తి ఇటీవల కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. ఈ విషయం గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ ఛైర్మెన్ భోస్లే మోహన్ రావ్ పటేల్ సోమవారం ముధోల్ లోని బాధిత కుటుంబానికి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆనంతరం యండి అజార్ కుటుంబం కు అండగా ఉండాలనే ఉదేశ్యంతో మృతుని కుటుంబం కు మోహన్ రావ్ పటేల్ పటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో లో ముధోల్ మాజీ ఎంపీపీ జాధవ్ సుభాష్ పటేల్, ఏజాజ్, నాయకులు పాల్గొన్నారు.

# చరిత్రను ఎవరూ మర్చిపోకూడదు: ఎమ్మెల్సీ కోదండరాం



జన్నారం: అమృత్ తెలంగాణ: చరిత్రను ఎవరూ కూడా మర్చిపోకూడదని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమవారం జన్నారం హరిత రిసార్ట్స్ నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆదిలాబాద్ ఆదివాసుల జిల్లా అని పేర్కొన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూమిపై శిస్తు వేశారని పేర్కొన్నారు. హక్కులు సాధనకు కొమురం భీమ్ ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# దేశ రక్షణలో జవాన్‌ల సేవలు మరువలేనివి..



బజార్ హత్నూర్: అమృత్ తెలంగాణ:దేశ రక్షణలో జవాన్‌ల సేవలు మరువలేనివని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అన్నారు. మండలంలోని జాతర్ల గ్రామానికి చెందిన ఆర్క మేఘనాథ్ సీఆర్పీఎఫ్ జవాన్ జారండ్ లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ సోమవారం వారి స్వగ్రామం జాతర్లలో జరిగిన అంతః క్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేఘనాథ్ భౌతికకాయానికి పూల మాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబానికి దూరంగా వెళ్లి దేశ సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టమని, అనారోగ్యంతో జవాన్ మేఘనాథ్ చనిపోవడం బాధాకరమని, మేఘనాథ్ ఆత్మకి శాంతి చేకూరాలని కోరారు. మేఘనాథ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గిరిజన శాఖ ద్వారా కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విపత్తు శాఖకు ఆపద

నిజామాబాద్ :అమృత్ తెలంగాణ: ఎక్కడైన అగ్నిప్రమాదం సంభవించినా.. ఏదైనా బహుళ అంతస్తుల భవనం ఆకస్మాత్తుగా సముదాయం కూలిపోయినా.. ఏదైనా టన్నెల్‌లో ప్రమాదం చోటుచేసుకున్నా.. వెంటనే గుర్తుకొచ్చేది అగ్నిమాపక శాఖ. ప్రస్తుతం ఆ విపత్తు శాఖకే ఆపద వచ్చింది. ఫైర్ స్టేషన్‌లలో సరిపడా సిబ్బంది లేక.. డీజిల్ బిల్లులు రాక స్థానికంగా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో 137 ఫైర్‌స్టేషన్లు, 9 ఔట్‌పోస్టులు ఉన్నాయి. కొత్తగా మరో 15 ఫైర్‌స్టేషన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న తొమ్మిది ఫైర్ స్టేషన్‌లలో సగం సిబ్బందితో మాత్రమే విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆపద సమయంలో 'తెలంగాణ ఫైర్ డిసాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్' ఎల్లప్పుడు ముందుంటుంది. 101కు ఫోన్ చేస్తే.. వెంటనే స్పందిస్తూ.. నష్టం తీవ్రతను, ప్రమాద స్థాయిని తగ్గిస్తుంటారు. అంతటి ప్రాధాన్యమున్న ఆ శాఖకు నిధులు లేక.. సిబ్బంది లేక ఉన్న వనరులతోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం 9 ఫైర్ స్టేషన్‌లు, రెండు ఫైర్ ఔట్‌పోస్టులు ఉన్నాయి. అయితే ప్రతి ఫైర్ స్టేషన్‌లో ఒక ఫైర్ ఆఫీసర్(ఎస్‌ఎఫ్‌వో), ఫైర్ ఇంజిన్ డ్రైవర్/ఆపరేటర్‌లు ఇద్దరు, లీడింగ్ ఫైర్ మెన్ ఒకరు, ఫైర్‌మెన్‌లు 9, కార్యాలయ సహాయకులు(క్లీనర్‌లు) ఒకరు కలిపి సుమారు 14 మంది విధుల్లో ఉండాల్సి ఉంది. వీరు షిఫ్టుల వారీగా 24 గంటల పాటు ఫైర్‌స్టేషన్‌లో అందుబాటులో ఉండాలి. ఒక్క షిఫ్టుకు కనీసం 5-6 గురు సిబ్బంది ఉండాల్సి ఉంది. కానీ సిబ్బంది కొరతతో ప్రస్తుతం ఒక్కో స్టేషన్‌లో 6-7 మంది సిబ్బందే ఉండటం గమనార్హం. వీరే మూడుషిఫ్టుల్లో పనిచేసే పరిస్థితి నెలకొంది. ఇటీవల నిర్వహించిన గ్రూప్స్ పరీక్షల్లో పలువురు ఎంపికై ఇతర శాఖలకు వెళ్లిపోయారు. దాంతో పాటు రిటైర్‌మెంట్ అయిన వారి స్థానంలో కొత్తవారిని తీసుకోకపోవడంతో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. నిజామాబాద్ జిల్లాలో మొత్తం ఆరు ఫైర్‌స్టేషన్‌లకు గాను ఇద్దరే ఫైర్ ఆఫీసర్‌లు ఉండటం గమనార్హం. ఏడీఎఫ్‌లో జాడే లేదు.

ఉన్న సిబ్బందితోనే విధులు

ప్రమాదాలు చెప్పిరావు.. కానీ ఏ ప్రమాదం ముంచుకొచ్చినా.. వెంటనే ఘటనా స్థలానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఒక వైపు మాక్ డ్రిల్స్ నిర్వహించడం, మరో వైపు స్కూళ్లల్లో, కాలేజీల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తుంటారు. అలా డ్రిల్స్ నిర్వహిస్తున్న సమయంలో.. ఎక్కడైనా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంటే వెంటనే స్పందించేందుకు అదనపు సిబ్బంది లేదు. డ్రిల్స్ నిర్వహిస్తున్న ప్రాంతం నుంచి ఘటనా స్థలానికి చేరుకునేందుకు ఆలస్యమైతే.. ప్రజలు ముందుగా నిందించేది అధికారులనే. అలాంటి సమయంలో ఇతర స్టేషన్‌ల నుంచి ఫైర్ ఇంజిన్‌ను పంపే వరకు ఆలస్యం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి తోడు రాష్ట్రంలో ఎక్కడైనా



పెద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటే జిల్లాల నుంచి సిబ్బందిని అక్కడికి పంపాల్సిందే. శ్రీశైలం టన్నెల్ ప్రమాదం వద్ద రెస్క్యూ ఆపరేషన్‌కు ఇరు జిల్లాల నుంచి సిబ్బందిని తరలించడం గమనార్హం.

డీజిల్ బిల్లులు పెండింగ్

కాగా ఫైర్ స్టేషన్ నిర్వహణకు ఎలాంటి ఫండ్స్ ఇవ్వకపోగా.. కనీసం స్కావెంజర్‌లు సైతం లేరు. దాంతో అధికారులు, సిబ్బంది తమ వేతనాల నుంచి కొంత మొత్తం వెచ్చించి ప్రయివేటు స్కావెంజర్‌లను నియమించుకొని వేతనాలు చెల్లిస్తున్నారు. కాగా ఫైర్ ఇంజన్ డీజిల్ బిల్లులు లక్షల్లో పెండింగ్‌లో ఉన్నాయి. నిజామాబాద్ ఫైర్ స్టేషన్‌ది సుమారు ఐదు లక్షల వరకు పెండింగ్ ఉండగా.. మిగతా స్టేషన్‌లది సుమారు రూ.50 వేల నుంచి 60 వేల వరకు పెండింగ్ ఉన్నట్టు సమాచారం. ఆ బిల్లులు చెల్లించకపోవడంతో ప్రతిసారీ పెట్రోల్ బంకుల నిర్వాహకులను బతిమిలాడాల్సిన దుస్థితి నెలకొంది. ఇన్ని సమస్యల మధ్యే.. ఆ శాఖ అధికారులు, సిబ్బంది శక్తికి మించి విధులు నిర్వర్తిస్తూ ప్రమాదాలను అరికట్టడంలో కృషి చేస్తున్నారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తూ.. సరిపడా సిబ్బందిని కేటాయిస్తే మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంది.

సిబ్బందికొరతపై నివేదించాం : ఇటీవల గ్రూప్ పరీక్షల్లో పలువురు సిబ్బంది ఎంపికై ఇతర శాఖలకు వెళ్లిపోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు ఫైర్‌స్టేషన్‌లలో ఖాళీలపై ఉన్నతాధికారులకు నివేదించాం. ఉన్నతాధికారుల సూచన మేరకు ఉన్న సిబ్బందితో లోటుపాట్లు రానీయకుండా విధులు నిర్వర్తిస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం 349 ఫిర్యాదులు రాగా వెంటనే స్పందించాం. కాగా అప్పటికే రూ.3.80 కోట్ల ఆస్తినష్టం వాటిల్లగా.. సుమారు రూ.21 కోట్ల ఆస్తినష్టం వాటిల్లకుండా అడ్డుకున్నాం. 22 మంది ప్రాణాలు కాపాడగలిగాం. పరమేశ్వర్, డీఎఫ్‌వో నిజామాబాద్

# విజేందర్ కు ఘన నివాళులు..

ఆర్మూర్ :అమృత్ తెలంగాణ: జిల్లాలో 108 సేవల సంస్థలో 2022 నుండి 2024 వరకు సేవలు అందించిన జిల్లా కోఆర్డినేటర్ విజేందర్ హైదరాబాద్ లో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగిందని 1962 కార్యవర్గ సభ్యులు అరుణ్ కుమార్ సోమవారం తెలిపారు. జిల్లాలో ఉద్యోగులతో జిల్లా రాష్ట్ర స్థాయి అధికారులతో సమన్వయం చేస్తూ జిల్లాను అత్యవసర సేవల్లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపి జిల్లాను ముందుకు తీసుకెళ్లారు. ఈసందర్భంగా వారి సేవలను స్మరిస్తూ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 108,102,1962 ఉద్యోగులు చిత్ర పటానికి పూలమాలలు వేసి, మౌనం పాటించి నివాళులు అర్పించడం జరిగింది. జిల్లా నుండి పెద్ద సంఖ్యలో



108 102 1962 ఉద్యోగులు ఈరోజు వారి అంత్యక్రియలకు స్వగ్రామమైన ములుగు జిల్లా రేగొండ మండలం రాయపల్లిలో పాల్గొన్నారు. వారి అకాల మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబానికి మనో ధైర్యం కల్పించి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 108 ఉద్యోగుల సంక్షేమ సంగం రాష్ట్ర కార్యదర్శి సుంకరి విజయ్,108 జిల్లా అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శేఖర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు ఆనంద్, భీంరావు, రాజు,1962, సాయి భారత్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

# గుంతల మయంగా మారిన రోడ్డు..

రెంజల్: అమృత్ తెలంగాణ: రెంజల్ మండలంలోని దండిగుట్ట నుంచి దూపల్లి గేటు వరకు గల రోడ్డు గుంతల మయమై వాహనదారులకు శాపంగా మారింది. రోడ్డు మధ్య భాగంలో గుంతలు ఏర్పడి నీరు నిండిపవడంతో తెలియని వాహనదారులు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనదారులు గండిగుట్ట క్రాసింగ్ నుంచి దూపాల్ గేటు వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుంది. మండల కేంద్రం నుంచి వచ్చే ప్రతి వాహనం నవీపేట గుండా రెండు కిలోమీటర్ల దూరం అయినా వెళ్లాల్సిన పరిస్థితి



నెలకొంది. ఆర్ అండ్ బి అధికారులు వెంటనే స్పందించి రోడ్డు ప్యాచ్ వర్క్ అయిన పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహా కల్యాణోత్సవం ..

డిచ్ పల్లి :అమృత్ తెలంగాణ: డిచ్పల్లి మండలంలోని ఖిల్లా డిచ్పల్లి గ్రామంలో గల పాలరాతి దేవాలయంలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం శ్రీ లక్ష్మీనరసింహా స్వామి కల్యాణోత్సవం ను ఆలయ ప్రధాన అర్చకులు వడియాల్ రవికుమార్ ఆధ్వర్యంలో వేద పండితులు కన్నుల పండువగా నిర్వహించారు. కళ్యాణ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని సేవించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పండితులు అరుణ్ కుమార్ శర్మ, సురేష్ శర్మ, కందాలై రాజగోపాల్ శర్మ , సాయి శంకర్ శర్మ, దేవి దాస్ రావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన న్యాయవాద పరిషత్

కంఠేశ్వర్ :అమృత్ తెలంగాణ: నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు ధనపల్ సూర్యనారాయణ జన్మదినం సందర్భంగా వారికి న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. జన హృదయ నేత ధర్మ పరిరక్షకులు పేదవారికి అండగా నిలబడేటటువంటి నీతి నిజాయితీ నిబద్ధత కలిగినటువంటి నాయకుడు ధన్పాల్ సూర్యనారాయణ ని వారు భవిష్యత్తులో ఇలాంటి అనేకమైనటువంటి జన్మదినాలు జరుపుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ సీనియర్ నాయకులు రాజకుమార్ సుబేదార్, పిల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# కెల్విన్ క్లైయిన్ ఇన్నర్‌తో రెచ్చిపోయిన బ్యూటీ



కపూర్ గాళ్స్ అనగానే సోనమ్ కపూర్, జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ అంటూ కొందరు గుర్తుకు వస్తారు కపూర్ గాళ్స్ అనగానే సోనమ్ కపూర్, జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ అంటూ కొందరు గుర్తుకు వస్తారు. కానీ బాలీవుడ్ లో కపూర్‌ల కుటుంబంతో సంబంధం లేకుండానే మరో కపూర్ గాళ్ నటిగా రాణిస్తోంది. ఫ్యాషన్ అండ్ మోడలింగ్ ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన ఈ బ్యూటీ భవిష్యత్ లో పెద్ద స్టార్ అవ్వాలని కలలు గంటోంది. ఇక ఆకాంక్ష సోషల్ మీడియా పోస్టులకు భారీ ఫాలోయింగ్ ఉంది. ఆకాంక్ష రంజన్ కపూర్ బాలీవుడ్ లో అప్ కమింగ్ స్టార్. గిల్టీ (2020) చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన ఈ బ్యూటీ ఆరంగేట్రమే ఫిల్మ్‌ఫేర్ అవార్డుల నామినేషన్‌ను అందుకుంది. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ రే (2021)తో ఓటీటీ రంగంలోకి ప్రవేశించింది. ఆకాంక్ష తండ్రి శశి రంజన్ అనుష్క రంజన్ అనే అక్క ఉంది. తను కూడా నటి. జమ్నాబాయి నర్సీ స్కూల్ నుండి పాఠశాల విద్యను పూర్తి చేసిన తర్వాత, ఆకాన్షా విస్లింగ్ వుడ్స్ నుండి యాక్టింగ్ డిప్లొమాను అభ్యసించింది. .సింగిల్ గానా? ఆకాంక్ష కపూర్ తన కెరీర్‌ను 2019లో టెలివిజన్ ఫ్యాషన్ సిరీస్ డీకోడెడ్‌తో ప్రారంభించింది. ఆ తర్వాత 'తేరే దో నైనా' అనే మ్యూజిక్ వీడియోలో అపరశక్తి ఖురానాతో కలిసి కనిపించింది. 2020లో నెట్‌ఫ్లిక్స్ చిత్రం గిల్టీతో సినీ రంగ ప్రవేశం చేసింది. ఈ చిత్రంలో అత్యాచార బాధితురాలిగా కనిపించింది. ఆకాంక్ష నటనకు ఉత్తమ సహాయ నటి (మహిళ)గా నామినేషన్ దక్కించుకుంది. తర్వాత 2021 నెట్‌ఫ్లిక్స్ సిరీస్ రేతో తన వెబ్ ప్రపంచంలోకి ప్రవేశించింది. ఈ సిరీస్‌లో హర్షవర్ధన్ కపూర్ సరసన కనిపించింది. ఆమె తదుపరి సంగీత వీడియో 'హమ్ హి హమ్ దే'లో ఆషిమ్ గులాటీతో కలిసి కనిపించింది. ఆ తర్వాత రాజ్‌కుమార్ రావ్, రాధికా ఆప్టే మరియు హుమా ఖురేషీలతో కలిసి 'మోనికా, ఓ మై డార్లింగ్'లో కనిపించింది. ఆకాంక్ష నటించిన రెండవ చిత్రమిది. ఇది విమర్శకులు సినీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఆకాంక్ష నటిగా షైన్ అయింది. తనకంటూ ఓ ప్రత్యేక మార్గాన్ని ఏర్పరుచుకునేందుకు ఆకాంక్ష హార్డ్ వర్క్ చేస్తోంది. ప్రస్తుతం మాయా వన్ అనే చిత్రంలో నటిస్తోంది.

# మడత పడిన నడుముతో దేవియాని గ్లామర్ ట్రీట్

ఎక్స్‌ప్రెషన్స్, ఆ అటిట్యూడ్ చూస్తుంటే అందరి ఫోకస్ ఆమెపై యూ టర్న్ తీసుకోకుండా ఉండదు. ఇన్‌స్టాగ్రామ్‌లో సోషల్ మీడియా యాక్టివిటీతో ఎప్పుడూ ఫోకస్‌లో ఉండే నార్త్ బ్యూటీ దేవియాని శర్మ తాజాగా షేర్ చేసిన గ్లామర్ ఫొటోలు ఇప్పుడు తెగ వైరల్ అవుతున్నాయి. ఆమె ఫాలోవర్లకు అందించిన ఈ లుక్‌కు నెటిజన్లు ఫిదా అయిపోయారు. ఎర్ర రంగు బ్లౌజ్, ఆకుపచ్చ చీరతో సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన దేవియాని తన గ్లామర్ లుక్‌తో ఫోటోషూట్‌కి కొత్త డెఫినిషన్ ఇచ్చింది. ఎక్స్‌ప్రెషన్స్, ఆ అటిట్యూడ్ చూస్తుంటే అందరి ఫోకస్ ఆమెపై యూ టర్న్ తీసుకోకుండా ఉండదు. ఫొటోలు చూసిన నెటిజన్లు 'ఫైర్' కామెంట్లతో ఫుల్ ట్రెండ్‌లోకి తీసుకొస్తున్నారు. దేవియాని శర్మ మొదటగా యూట్యూబ్ వెబ్ సిరీస్‌లతో వెలుగులోకి వచ్చారు. 'సేవ్ ది టైగర్స్', 'షైతాన్', వంటి వెబ్ కంటెంట్ ప్రాజెక్టుల్లో ఆమె నటనకు మంచి గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా సైతాన్ సిరీస్‌లో ఆమె పోషించిన ఇంటెన్స్ క్యారెక్టర్‌కు సంబంధించిన లుక్స్, యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దేవియాని ఏ పాత్రలోనైనా ఒదిగిపోయే నైపుణ్యం ఉండటంతో ఆమెకు వరుసగా అవకాశాలు వచ్చాయి. వెబ్ సిరీస్‌లతో పాటు సినిమాలపై కూడా ఫోకస్ పెడుతున్న దేవియాని త్వరలో టాలీవుడ్‌లో ఒక మంచి పాత్రతో




రాబోతున్నట్లు సమాచారం. తెలుగులో ఆమెకు పూర్తి స్థాయి గ్లామర్ రోల్స్‌తో పాటు పెర్ఫార్మెన్స్‌ను హైలైట్ చేసే పాత్రలపై ఆసక్తి ఉంది. ఈ మధ్య వచ్చిన ఓ ఫోటోషూట్‌లో కూడా ఆమె స్టన్నింగ్‌గా కనిపించడం చూస్తే, స్టార్ ఇమేజ్ కోసం ఎలా ప్లాన్ చేసుకుంటున్నదో అర్థమవుతోంది. ఇటీవల ఆమె పుట్టినరోజు సందర్భంగా చాలా సెలబ్రిటీలు, ఫ్యాన్స్ సోషల్ మీడియాలో విషెస్ చెబుతుండగా, ఆమె పోస్ట్ చేసిన స్టైలిష్ లుక్స్‌కి హృదయాలే పెట్టేశారు. దేవియాని సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే బ్యూటీ. ఇన్‌స్టా రీల్స్, ట్రెండింగ్ ఫోటోషూట్లతో ఫాలోయింగ్ పెంచుకుంటూ కెరీర్ పరంగానూ ముందుకు సాగుతోంది.

# ఆలయంలో జరిగే ప్రోగ్రాంకు వచ్చి స్పృహ తప్పిన హీరో విశాల్

తాజాగా ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాల్ ఇలాంటి పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అసలేమైంది? అన్న వివరాల్లోకి వెళితే. తమిళ సినీ నటుడు విశాల్ అనారోగ్యానికి గురయ్యారు. దేవాలయంలో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. ఉన్నట్లుండి ఒక్కసారిగా వేదికపై స్పృహ తప్పి పడిపోవటంతో కలకలం రేగింది. ఆ వెంటనే ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు. ఇటీవల కాలంలో ఆయన ఆరోగ్యంపై పలు వార్తలు వస్తున్న వేళ.. తాజాగా ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాల్ ఇలాంటి పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అసలేమైంది? అన్న వివరాల్లోకి వెళితే.. తమిళనాడులోని విల్లుపురం జిల్లాలోని కూవాగంలోని కూత్తాండవర్ ఆలయంలో చిత్తిరై వేడుకల్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ట్రాన్స్ జెండర్లకు మిస్ కూవాగం 2025 పోటీల్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో విశాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం జరుగుతుండగా ఒక్కసారిగా విశాల్ స్పృహ తప్పి పడిపోయారు. దీంతో అక్కడి వారిలో ఆందోళన నెలకొంది. వెంటనే ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు. అయితే.. ఆయన ఆహారం తినకపోవటం వల్లే నీరసానికి గురై.. స్పృహ తప్పినట్లుగా తెలుస్తోంది. అక్కడే ఉన్న తమిళనాడు మాజీ మంత్రి పొన్ముడి ఆయన్ను ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేశారు. దీంతో విశాల్ కోలుకున్నారు. అరగంట తర్వాత తిరిగి కార్యక్రమానికి హాజరు కావటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల మదగజ రాజా సినిమా ప్రమోషన్స్ లోనూ విశాల్ నీరసంగా కనిపించటం.. దానికి సంబంధించిన వీడియోలు తెగ వైరల్ అయ్యాయి.




# పవన్ హీరోయిన్‌ని ఇలా ఎప్పుడూ చూడలేదు!




'కహోనా ప్యార్ హై'తో దేశవ్యాప్తంగా భారీ ఫాలోయింగ్ సంపాదించుకున్న అమీషా పటేల్ ఆ తర్వాత 'బద్రి' సినిమాతో టాలీవుడ్ కి పరిచయమైంది 'కహోనా ప్యార్ హై'తో దేశవ్యాప్తంగా భారీ ఫాలోయింగ్ సంపాదించుకున్న అమీషా పటేల్ ఆ తర్వాత 'బద్రి' సినిమాతో టాలీవుడ్ కి పరిచయమైంది. హృతిక్ సరసన బాలీవుడ్ లో, పవన్ కల్యాణ్ సరసన టాలీవుడ్ లో పరిచయమైంది. అటుపై తెలుగులో పలువురు అగ్ర హీరోల సరసన నటించింది ఈ బ్యూటీ. పవన్ కల్యాణ్, మహేష్, బాలకృష్ణ లాంటి టాప్ స్టార్ల సరసన నటించింది. కానీ దురదృష్టవశాత్తూ ఇక్కడ ఆశించిన స్థాయికి ఎదగలేదు. అటుపై బాలీవుడ్ లో వరుస చిత్రాలతో బిజీ అయింది. అక్కడ అగ్ర హీరోల సరసన అమీషా నటించింది. కెరీర్ ఆద్యంతం తనదైన అందం, హొయలుతో ఉర్రూతలూగించిన అమీషా పటేల్ కి ఇటీవల ఏజ్ సమస్యలు ఎక్కువయ్యాయి. వయసు పెరుగుతుంటే పోటీ ప్రపంచంలో అమీషాకు అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో ఈ బ్యూటీ సోషల్ మీడియాల్లో గేమ్ ఛేంజర్ గా మారేందుకు తనవంతు ప్రయత్నాలను విడిచిపెట్టడం లేదు. పదే పదే బోల్డ్ ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. తాజాగా అమీషా షేర్ చేసిన ఫోటోషూట్ దీనికి సింబాలిక్ అంటూ నెటిజనులు కామెంట్లు చేస్తున్నారు. బుట్టబొమ్మ ఆన్ సెట్స్ కి సోలోగా..సింగిల్ గానా? ఇటీవలే గదర్ 2తో భారీ బ్లాక్ బస్టర్ అందుకున్న అమీషా నిరంతరం తన సోషల్ హ్యాండిల్‌లో బోల్డ్ ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com